క్లుప్తంగా

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిళ్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన తాటాకిళ్లు

కొత్తపల్లి: మండలంలోని గోర్స్‌లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. బాధితులు, పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గోర్స ఎస్సీపేటకు చెందిన బూరా లోవరాజు, బూరా పామియ్య, బూరా నూకరాజుకు చెందిన తాటాకిళ్ల నుంచి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. గృహోపకరణాలతో పాటు రెండు బైక్‌లు, 4 సైకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసి నష్టాన్ని అంచనా వేశారు. గ్రామ సర్పంచ్ రొంగల వీరబాబు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసిన నాయకులు

కొత్తపల్లి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు అన్నారు. మండలంలోని కొండెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను నగదు ప్రోత్సాహం, సర్టిఫికెట్లతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే అత్యధిక మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గాది గంగబాబు, మేడిశెట్టి శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ప్రాణాలకు భద్రత కల్పించాలి

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లి వచ్చే మత్స్యకారుల ప్రాణాలకు ప్రభుత్వం భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్యే వర్మ కోరారు. మండలంలోని అమీనాబాదు తీరప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మేజర్ హార్బర్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు.

చెట్ల వేలం పాట వాయిదా



చెట్ల వేలానికి వచ్చిన పాటదారులు, అధికారులు

సామర్లకోట: స్థానిక జగనన్న కాలనీలో ఉన్న చెట్లకు శుక్రవారం నిర్వహించాల్సిన బహిరంగ వేలం వాయిదా పడింది. వేలం పాటను రూ.14 లక్షలు నుంచి ప్రారంభింగా, చెట్ల విలువ అంత ఉండదని రూ.ఏడు లక్షల నుంచి ప్రారంభించాలని పాటదారులు డిమాండ్ చేశారు. అయితే పారెస్టు అధికారుల నిర్ణయం మేరకే పాట జరుగుతుందని కమిషనర్ తెలిపారు. దీనికి పాటదారులు ముందుకు రాక పోవడంతో ఈనెల 27వ తేదీకి పాటను వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్వో పూడి రవిబాబు, టౌన్ ప్లానింగ్ అధికారి ఫణి కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మరిడమ్మకు స్వర్ణపుష్పాలతో పూజ



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న మరిడమ్మ వారు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహన రావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాలన ముంగిట్లో ఉన్నట్టే

- అన్ని ప్రభుత్వ శాఖలకు ఒకటే కేంద్రం
- దరఖాస్తు చేస్తే చాలు పరిష్కారమైనట్టే
- వ్యయ, ప్రయాసలు తీర్చిన సీఎం జగన్



ఉండూరు గ్రామంలోని సచివాలయం

సామర్లకోట: ప్రజల వద్దకే పాలన అనేది రాజకీయ నాయకుల దశాబ్దాల నినాదం. కానీ ఏ పని కావాలన్నా వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి, అధికారి ఉంటే సిబ్బంది లేక, సిబ్బంది ఉంటే ఆ పత్రం లేదనీ, ఈ పత్రం లేదని మెలికలు పెట్టడం, చేయి తడపందే ఏ పనీ కాకపోవడం అబ్బో అన్నీ ఇన్నీ అవస్థలు కావు. రేషన్ కార్డు మొదలుకొని వీసా కార్డు వరకు అన్నీ గగన కుసుమాలే. అందినట్టే ఉండి ఏవీ అందేవి కావు. నేటి పరిస్థితి దానికి విభిన్నం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన పాలనను ప్రతి ఇంటి ముంగిటకూ తీసుకువచ్చేశారు. రెండు మూడు వేల మంది జనాభాకు ఏ విభాగానికి చెందిన సమస్య అయినా అక్కడకక్కడే పరిష్కారమయ్యేలా గ్రామ సచివాలయానికి రూపకల్పన చేసి అన్ని విభాగాలకు సిబ్బందిని, వలంటీర్లను నియమించి కాల వ్యవధిలో దరఖాస్తులకు పరిష్కారం లభించేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజల కోసమే పని చేస్తున్న జగనన్న....

ఎవరెన్ని విమర్శలు చేస్తున్నా ప్రజలకు మేలు జరిగితే చాలనేలా ముఖ్యమంత్రి పాలన సాగుతోందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన వైఎస్సార్ పింఛన్, అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, ఆసరా, రైతు భరోసా, భూముల రీసర్వే, రేషన్ కార్డులు, జనన, మరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్ తదితర పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా అందజేస్తున్నారు. మండల పరిధిలో 18 గ్రామాల్లో 21 సచివాలయాల ద్వారా వివిధ పథకాలకు సంబంధించి నాలుగేళ్లలో 1,33,973 మందికి రూ.198.4 కోట్ల లబ్ధి అందినట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు.

గతంలో సర్టిఫికెట్ల కోసం తీవ్ర ఇక్కట్లు



ఏటా పాఠశాలలు తెరుస్తున్నారంటే పిల్లలకు కావలసిన ధ్రువపత్రాల కోసం ఎక్కడో ఉన్న రెవెన్యూ, విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ తిరిగి ఎంతో శ్రమ పడితే కానీ లభించేవి కాదు. సుమారు పది రోజుల పాటు అవస్థ పడేవాళ్లం. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత దరఖాస్తు చేసిన వెంటనే వలంటీర్లు ఇంటికి వచ్చి వివరాలు తెలుసుకుని 24 గంటల్లో సర్టిఫికేట్లు చేతిలో పెడుతున్నారు. సచివాలయం ద్వారా ప్రభుత్వ పథకాలు అందుకుంటున్నాం.

– పేపకాయల నవీన్, విద్యార్థి తండ్రి, పీబీ దేవం

తిప్పలు తప్పాయి



గతంలో ప్రతి పనికీ కాళ్లరిగేలా సామర్లకోటకు ఆరు కిలో మీటర్లు వెళ్లాల్సి వచ్చేది. ఇంటి స్థలం కోసం ఎన్నోసార్లు మండల కార్యాలయం చట్టు తిరిగినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇళ్లు లేని వారిని గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లు నిర్మించుకునే వరకు సాయపడుతున్నారు.పేద మహిళలకు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇంతటి మేలు చేస్తున్న జగనన్నను ఎన్నటికీ మరచిపోలేం.

– దొమ్మిశెట్టి శేష అచ్యుతాంబ, గృహిణి, గొంచాల

పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు..

- ఉష్ణతాపంతో అల్లాడుతున్న ప్రజలు
- 45 డిగ్రీల నమోదు



నిత్యం రద్దీగా ఉండే రథం సెంటర్‌లో మూసివేసిన దుకాణాలు

సామర్లకోట: సూర్య ప్రతాపంతో వేగలేకపోతున్నామని, త్వరగా రావయ్యా అని వరుణుడిని వేడుకుంటున్నారు ప్రజలు. మునుపెన్నడూ లేనంతగా పెనంపై కాదు ఏకంగా పొయ్యిలో పడినట్టు ఉష్ణోగ్రతలు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వేసవి కాలంలో అత్యంత ప్రమాదకరమైన రోహిణి ముగిసినా ఎండలు మాత్రం తగ్గడం లేదు. ఎండలకు తోడుగా వేడి గాలులు వీయడంతో ప్రజలు శుక్రవారం అల్లాడిపోయాయి. శుక్రవారం సామర్లకోట పట్టణ పరిధిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ఎండలకు పిల్లలు, పెద్దలు అల్లాడి పాయారు. రాత్రి దాటినా వేడి గాలి వీయడంలో ప్రజలు బయపడుతు న్నారు. ఈ ఎండలు, గాల్పులు మరి కొన్ని రోజులు ఉంటాయని రాష్ట్ర విపత్తులశాఖ అధికారులు ప్రకటించడంతో శనివారం నుంచి పిల్లలను బడికి పంపడానికి తల్లిదండ్రులు బయపడుతున్నారు.

రోటరీ చేయూత భవన్‌కు రూ.లక్ష విరాళం



చేయూత భవన్‌కు విరాళాన్ని అందిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: ఉచిత వసతి, భోజనం, విద్యనందిస్తున్న చేయూత సంస్థ, రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రోటరీ చేయూత భవన్‌కు రోటరీ గవర్నర్ భాస్కర్‌రామ్ రూ.లక్ష చెక్కును అందించారు. ఈ చెక్కును శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు కృష్ణ ప్రకాష్, మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు చేయూత సంస్థ చైర్మన్ రవికి రోటరీ క్లబ్‌లో అందించారు. ఇటీవల గవర్నర్ సందర్శించినపుడు విద్యార్థులకు అదనంగా షెడ్ కావాలని అడగ్గా ఈ మేరకు సాయం అందించారన్నారు.

జెడ్పీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

బోట్‌క్లబ్: ఉమ్మడి తూర్పుగోదావరి 1978 డీఎస్సీ ప్యానెల్ జిల్లా పరిషత్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం కాకినాడలో ఒక హోటల్‌లో జరిగింది. వివిధ హోదాల్లో పదవీ విరమణ చేసిన వారంతా ఒక చోట కలుసుకొని అలనాటి జ్ఞాపకాలును నెమరవేసుకున్నారు. దేశంలో పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారు 45 ఏళ్ల తర్వాత కలుసుకుని సందడి చేశారు.

అప్పటి జెడ్పీ కార్యదర్శి దివంగత కళా వెంకట్రావు చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. పంచాయతీరాజ్ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ సీఎస్‌వీఎస్ కొండయ్యశాస్త్రి, విశ్రాంత జేడీ కన్నబాబు, విశ్రాంత ఏఓ నేలపూడి ఉష, ఉద్యోగులు తుమ్మల నూకరాజు, పైన్ని సూర్యనారాయణ, కస్తూరి రాజారావు, వెంకటకుమార్, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శన నిశ్శబ్దమా నీ ఖరీదెంత?



'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' దర్శకుడు కృష్ణప్రసాద్ బృందానికి ప్రథమ బహుమతిని అందజేస్తున్న క్లబ్ అధ్యక్షుడు భాస్కరరావు తదితరులు

- ముగిసిన జాతీయస్థాయి నాటిక పోటీలు
- చీకటి పువ్వు, అతీతం నాటికలకు ద్వితీయ, తృతీయ బహుమతులు

కాకినాడ కల్చరల్: స్థానిక ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ దంటు కళాక్షేత్రంలో కాకినాడ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు శుక్రవారంతో ముగిసాయి. విశాఖపట్టణం వారి తెలుగు కళాసమితి సమర్పణలో చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై ంది. ద్వితీయ ప్రదర్శనగా చైతన్య కళాభారతి (కరీంనగర్) సమర్పణలో ప్రదర్శించిన చీకటి పువ్వు, తృతీయ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ (గుంటూరు) సమర్పణలో ప్రదర్శించిన అతీతం నాటికలు ఎంపికయ్యాయి ఎంపికయింది. ఉత్తమ నటుడిగా అతీతం నాటికలో రాఘవ పాత్రధారి యస్.రవీంద్రరెడ్డి, ఉత్తమ నటిగా చీకటి పువ్వు నాటికలో పవిత్ర పాత్రధారి లహరి ఎంపికయ్యారు. వీరికి ది యంగ్మెన్స్ హేపీక్లబ్ అధ్యక్షులు దంటు భాస్కరావు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీవీ రావు, అసోసియేషన్ కన్వీనర్లు ఎన్.ప్రభుదాస్, కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఇండుగపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

కోటనందూరు: మండలంలోని ఇండుగపల్లిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శిని వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉష్ణతాపం, వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చిన్నారులు, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. పీహెచ్ఎన్ రాజమణి, హెచ్ఎస్ అప్పారావు, ఎంపీహెచ్ఏ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

కిర్లంపూడి: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎల్‌డీఓ కేఎస్‌వీ ప్రసాద్‌రావు సూచించారు. జగపతినగరం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. సచివాలయాల్లో తక్కువ ఖర్చుతోనే అందుతున్న డిజిటల్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చిల్లంగిలో రూ.15 లక్షలతో నిర్మించిన పురగిరి క్షత్రియ మల్టిపుల్ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, ఏఈ నారాయణరావు తదితరులు ఉన్నారు.

ఈదురు గాలులతో అరటి పంటకు నష్టం



మండపంలో నేలకొరిగిన అరటి తోటలను పరిశీలిస్తున్న హెచ్ఓ అరుణ్‌కుమార్

శంఖవరం: ఇటీవల వీచిన ఈదురు గాలులకు అరటి పంటలకు భారీ నష్టం వాటిల్లినట్టు ఉద్యానశాఖాధికారి అరుణ్ కుమార్ తెలిపారు. మండలంలోని మండపం, రౌతులపూడి మండలంలోని పారుపాక గ్రామాల్లో దెబ్బతిన్న అరటి పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈదురు గాలులకు 43 ఎకరాల్లో అరటి తోటలకు నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి దొడ్డా విజయ్



గోకవరం: టీడీపీ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు దొడ్డా విజయ్ వైఎస్సార్ సీపీలోకి చేరనున్నట్టు ప్రకటించారు. ఇటీవల టీడీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన ఆయన తాజాగా ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. గోకవరం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల తాను స్వచ్ఛందంగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును కలిసి తన నిర్ణయం వెల్లడించగా ఆయన స్వాగతించారన్నారు. ఎటువంటి పదవులను ఆశిస్తూ తాను వైఎస్సార్ సీపీలోకి చేరడం లేదని స్పష్టం చేశారు. తనను పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యేకు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

చేపల వేటను అడ్డుకున్న కౌన్సిలర్లు

- కమిషనర్‌కు ఫిర్యాదు
- చెరువు గట్టుపై నిషేధాజ్ఞలు



చేపల పడవలను ఒడ్డుకు తీసుకు వచ్చిన దృశ్యం



చెరువు గట్టుపై ఉన్న వారిని బయటకు పంపుతున్న పోలీసులు

సామర్లకోట: స్థానిక ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న నాగార్జున ఫిల్టర్ చెరువులో గురువారం అర్ధరాత్రి నుంచి కొనసాగుతున్న చేపల వేటను కౌన్సిలర్లు అడ్డుకున్నారు. వేట జరుగుతోందని తెలిసి చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ సూచనల మేరకు కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్, నేతల హరిబాబు, కరణం రాజ్‌కుమార్, చల్లపల్లి వెంకట సత్యనారాయణ తదితరులు మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు సమాచారం ఇవ్వగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చెరువు గట్టు వద్ద ఉన్న వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కమిషనర్ మాట్లాడుతూ చెరువులో నీటి మట్టం తక్కువగా ఉండటంతో నీరు కలసిపోతుందని, కౌన్సిల్ నిర్ణయం మేరకు చేపల వేటకు నిషేధిస్తున్నట్టు తెలిపారు. మున్సిపాలిటీ అనుమతి లేకుండా చేపల వేట సాగిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు. కాగా శుక్రవారం ఉదయం కూడా చేపల వేట జరగడంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తూ చెరువులోని పడవలను బయటకు తీసుకువచ్చే చర్యలు చేపట్టి వేటదారులను బయటికి పంపేశారు. కాగా చెరువులో చేపల వేటకు బహిరంగ వేలం నిర్వహించి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా చూడాలని కమిషనర్‌ను కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అప్పుడు కూడా చెరువులో కనీసం మూడు మీటర్ల కంటే తక్కువ నీటిమట్టం ఉంటే చేపల వేటకు అనుమతించకూడదని వారు సూచించారు.

సత్యదేవుని దర్శించిన హోం మంత్రి వనిత



హోం మంత్రి వనితకు నూతన పట్టు వస్త్రాలు బహూకరిస్తున్న దేవస్థానం చైర్మన్ రోహిత్



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న బీఎస్ రామయ్య విద్యాసంస్థల అధినేతలతో పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు

అన్నవరం: రాష్ట్ర హోం శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆమెకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆధ్వర్యంలో పండితులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా నూతన పట్టువస్త్రాలను దేవస్థానం చైర్మన్ రోహిత్, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఈఓ చంద్రశేఖర్ అజాద్ అందజేశారు. మంత్రి వెంట డీఎస్పీ లతా కుమారి, ప్రత్తిపాడు సీఐ కిషోర్ బాబు, దేవస్థానం అధికారులు ఉన్నారు.

సత్యదేవుని దర్శించిన బీఎస్ రామయ్య విద్యాసంస్థల అధినేతలు

అన్నవరం: బెంగళూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, బీఎస్ రామయ్య విద్యాసంస్థల అధినేతలు బీఎస్ సీతారామ్, జయరామ్, జానకీరామ్ శుక్రవారం తమ కుటుంబ సభ్యులతో కలిసి రత్నగిరిపై సత్యదేవుని వ్రతాలాచరించారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత రత్నగిరిపై పండితులు వారికి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు దేవస్థానంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

19న బాస్కెట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

సామర్లకోట: ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25 వరకు గుంటూరులో జరుగనున్న అంతర్ జిల్లాల జూనియర్ బాలుర పోటీలకు 19వ తేదీన జిల్లా జట్టు ఎంపిక జరుగుతుందని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే ఎంపికలకు ఆసక్తి కలిగిన 18 ఏళ్ల లోపు బాలురు హాజరు కావలసి ఉంటుందన్నారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కొండలరావు, బండే కృష్ణార్జున్‌ల ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, టెన్త్ మార్కుల లిస్టు జెరాక్స్ తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఈ ఎంపిక పోటీలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రారంభిస్తారని, చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు పాల్గొంటారని తెలిపారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఏకశిల పెద్ద నందికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో ఉన్న ఏకశిలా నందికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మాస శివరాత్రి పూజలు జరిగాయి.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువఝ్జల అవధాని, ముష్టి పురుషోత్తం, చిట్టెం వాసు, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 14 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, ఉప ప్రధానార్చకుడు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలోనూ పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

సమాజ సేవకు ప్రాధాన్యం ఇవ్వాలి

తుని: ప్రతిఒక్కరూ సమాజ సేవకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రముఖ సైకాలజిస్ట్ పాలంకి సుజాత అన్నారు. స్థానిక రెడ్ కాన్వెంట్ వీధిలోని రోటరీ భవనంలో శుక్రవారం సాయంత్రం విన్నర్‌వీల్, రోటరీక్లబ్, రోటరాక్టు క్లబ్ ఆత్మీయ సమావేశం క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు నేరేళ్ల సాయిబాబా అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సుజాత ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పలు అంశాలను వివరించారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు శివకోటి మధుసూదనరావు సేవ–పర మార్థం అనే అంశంపై అవగాహన కల్పించారు. రోటరీక్లబ్ కార్యదర్శి మలిపెద్ది సురేష్, కోశాధికారి కోరుకొండ గణేష్‌తో పాటు తుని, పాయకరావుపేట, అన్నవరం రోటరీక్లబ్‌లకు చెందిన 150 మంది సభ్యులు పాల్గొన్నారు.